సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం । 7 । జూలై । 2025



ఉన్నత చదువులకు 'ఓపెన్'

రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 56 కేంద్రాల్లో ఓపెన్ స్కూల్ పద్ధతిలో పదో తరగతి, ఇంటర్ విద్యనందిస్తోంది. 8లో



వణికిస్తున్న విషజ్వరాలు..

ఏజెన్సీలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇప్పటికే 25 మలేరియా, 9 డెంగీ కేసులు నమోదయ్యాయి. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 25°

వాతావరణం

జిల్లాలో సోమవారం అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది. ఆకాశం మేఘావృతంగా మారి, వాతావరణం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు ప్రజావాణి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజా సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆదేశించారు.

కిన్నెరసానిలో జలవిహారం



కిన్నెరసాని జలాశయంలో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. డ్యామ్, జలాశయం, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. ప్రకృతి సౌందర్యాల నడుమ సేదతీరారు. 510 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ. 27,630 ఆదాయం లభించింది. 250 మంది బోటు షికారు చేయగా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.15,030 ఆదాయం సమకూరినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఐటీఐ విద్యార్థులకు ఎక్స్‌లెంట్ అవార్డు



అవార్డు అందజేస్తున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి

మణుగూరు టౌన్: ప్రభుత్వ ఐటీఐలో చదువుకుని ఉద్యోగాలు చేస్తున్న ఇద్దరు పూర్వ విద్యార్థులు తెలంగాణ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రెనింగ్ శాఖ నుంచి ఎక్స్‌లెంట్ అవార్డులు అందుకున్నారు. మణుగూరు ఐటీఐ ప్రిన్సిపాల్ బడుగు ప్రభాకర్ ఆదివారం వివరాలు వెల్లడించారు. అవార్డు గ్రహీతలు సమీర్, ద్వారకామైలను అభినందించారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగం పొందిన విద్యార్థులను కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ఘనంగా సన్మానించారని తెలిపా రు.

నేటి నుంచి శిక్షణ

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల నిర్వహణపై రెండు రోజులపాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరాచారి తెలిపారు. ఆదివారం ఆయన వివరాలు వెల్లడించారు. జిల్లాలోని 21 పీఎంశ్రీ ఉన్నత పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశామని, వీటి నిర్వహణపై ప్రతి పాఠశాల నుంచి ముగ్గురు ఉపాధ్యాయులకు ఈనెల 7, 8 తేదీల్లో శిక్షణ ఇస్తామని తెలిపారు. పాల్వంచలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, భద్రాచలంలోని కొర్రాజులగుట్ట ఉన్నత పాఠశాలలో శిక్షణ ఉంటుందన్నారు. ల్యాబ్‌లో అత్యాధునిక పరికరాలను వినియోగం, ప్రాజెక్ట్‌లు తయారీ తదితర అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు.

మానవ హక్కుల వేదిక విచారణ



బాధిత మహిళలతో మాట్లాడుతున్న మానవ హక్కుల వేదిక ప్రతినిధులు

బూర్గంపాడు: ఇరవెండి ఫారెస్ట్ బీట్‌లోని కొసగుంపు వలస ఆదివాసీ గ్రామంలో ఇటీవల ఫారెస్ట్ అధికారులకు, ఆదివాసీ మహిళలకు మధ్య జరిగిన దాడి ఘటనపై మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిజనిర్ధారణ విచారణ చేపట్టారు. వేదిక ప్రతినిధులు బాధిత ఆదివాసీ మహిళలతో మాట్లాడి పూర్తి వివరా లు తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ వలస ఆదివాసీ మహిళలపై దాడికి పాల్పడిన ఫారెస్ట్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈఘటనపై ఆదివాసీ ఎమ్మెల్యేలు, ఎంపీలు స్పందించకపోవటం దురదృష్టకరమని పేర్కొన్నారు. 2005 డిసెంబర్ 13 కంటే ముందు నుంచి పోడు సాగుచేసుకుంటున్న వారందరికీ పట్టాలివ్వాలని కోరారు. కొసగుంపు ఘటనపై జ్యుడీషియరీ ఎంక్వైరీ చేయాలని, బాధిత మహిళలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కొసగుంపులో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని, విద్య, వైద్యం, తాగునీటి వసతులను కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు బదావత్ రాజు, ఖాదర్‌బాబా, జిల్లా అధ్యక్షుడు దాగం ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి దిలీప్, రమేష్ బండారి, ఊకే ముక్తేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పుష్కరాల తరుణంలో పెరుగుతున్న స్వరం



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విలీనమైన ఎటపాక గ్రామ శివారు ప్రాంతం

- ఏపీ విలీన పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపాలని డిమాండ్
- వసతి, సౌకర్యాలకు భూ సమస్య కూడా తీరే అవకాశం
- భద్రాచలంలో భక్తుల రద్దీకి తగినట్లు ఏర్పాట్లకు స్థలం..
- మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు గళమెత్తాలని విన్నపాలు



పుష్కర స్నానం చేస్తున్న భక్తులు (ఫైల్)

భద్రాచలం: గోదావరి పుష్కరాలకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. పన్నెండేళ్లకోసారి జరిగే ఈ క్రతువులో లక్షల కొద్దీ భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారు. వారందరికీ తగిన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం తాత్కాలిక వసతులు, శాశ్వత నిర్మాణాలు, మరుగుదొడ్లు, అన్నదానసత్రాలు వంటివి నిర్మించాలి. కానీ భద్రాచలంలో ఇప్పటికే భూ సమస్య వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో పుష్కరాల అభివృద్ధి పనులకు భూమెక్కడ అనే ప్రశ్న తలెత్తోంది. ఏపీలో కలిపిన ఐదు పంచాయతీలను తెలంగాణలో తిరిగి విలీనం చేస్తే 2027 జూలైలో జరిగే పుష్కరాలకు భూ సమస్య తీరుతుందని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

వసతులు పరిమితం.. అద్దెలు అధికం

శ్రీ సీతారామచంద్రస్వామివారి దర్శనం కోసం భద్రాచలం వచ్చే భక్తుల రద్దీ రోజురోజుకూ పెరుగుతోంది. దేవస్థానం కాటేజీలు, వసతి గదులు మాత్రం స్వల్ప స్థాయిలో ఉన్నాయి. దీంతో ప్రైవేట్ లాడ్జీల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వారాంతపు సెలవు దినాల్లో రూ. వేలల్లో అద్దె వసూలు చేస్తున్నారు. పది వేల మంది భక్తులు వస్తేనే ఇలాంటి ఇబ్బందులు తలెత్తితే పుష్కరాల సమయంలో రోజుకు లక్షకు పైగా భక్తులు వస్తారు. దీంతో వసతి సమస్య జఠిలంగా మారనుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తుగా శాశ్వత, తాత్కాలిక వసతి నిర్మాణాలను చేపట్టాల్సి ఉంది. ఇప్పటికే కాళేశ్వరం వంటి పుణ్యక్షేత్రంలో పుష్కరాల పనులకు భూ సర్వే చేస్తున్నారు.

ఐదు పంచాయతీలను కలిపితే భూమి అందుబాటులోకి..

ప్రస్తుతం భద్రాచలానికి మూడు వైపులా కిలోమీటరు పరిధి మించి విస్తీర్ణం లేదు. కానీ ఏపీలో కలిసిన గుండాల, పిచుకలపాడు, కన్నాయిగూడెం, ఎటపాక, పురుషోత్తపట్నం గ్రామాలు ఇప్పటికీ భద్రాచలంలో అంతర్భాగంగానే ఉన్నాయి. రాష్ట్రాలు వేరయినా దైనందిక కార్యక్రమాలు, పనులు భద్రాచలంతోనే ముడిపడి ఉన్నాయి. ఆ ఐదు పంచాయతీలను తెలంగాణలో కలిపితే భద్రాచలానికి భూమి అందుబాటులోకి వస్తుంది. పురుషోత్తపట్నంలో స్వామి వారికి సుమారు 900 ఎకరాల భూమి ఉంది. దీంతో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టవచ్చు. చర్ల రోడ్డులో ఉన్న ఎటపాక, కూనవరం రోడ్డులో ఉన్న గుండాల పంచాయతీల్లో అటు వైపు నుంచి వచ్చే ట్రాఫిక్‌ను నియంత్రించవచ్చు. పుష్కరాల నేపథ్యంలో పంచాయతీల విలీన డిమాండ్‌పై స్వరం మరింత పెరుగుతోంది.

మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు చొరవ చూపాలి

మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు చొరవ తీసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉంది. రాజ్యాంగ సవరణ ద్వారానే విలీనం పూర్తయ్యే అవకాశం ఉండటంతో పార్లమెంట్ సభ్యుల పాత్రే కీలకం. ఎన్నికల ముందు ఎంపీ బలరాంనాయక్ సైతం ఇదే హామీ ఇచ్చారు. పార్టీలకు అతీతంగా ఇతర ఎంపీల సహాయ సహకారాలతో పార్లమెంట్‌లో ఈ సమస్యను లేవనెత్తాలని బలరాంనాయక్‌ను భక్తులు కోరుతున్నారు. నిజామాబాద్‌లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను ఇటీవల కలిసిన రాష్ట మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇదే విషయమై విన్నవించారు. పుష్కరాల తరుణంలోనైనా విలీన పంచాయతీలు, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని పలువురు కోరుతున్నారు.

ఐదు పంచాయతీలను తెలంగాణలో కలపాలి



మా అభిప్రాయం తెలుసుకోకుండా ఏపీలో విలీనం చేసి అన్యాయం చేశారు. దీని వల్ల ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. పార్టీలన్నీ ఏకమై కేంద్రం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలి. రానున్న పుష్కరాల సమయంలో అందరి దృష్టి భద్రాచలం వైపే ఉంటుంది. పంచాయతీలకు ఇదే సరైన తరుణంగా భావించి ఎంపీలు చొరవ చూపాలి.

– బందారు వీరభద్రం, కన్నాయిగూడెం, విలీన గ్రామపంచాయతీ వాసి

రామాలయంలో తొలి ఏకాదశి సందడి



ఆలయంలో భక్తుల కోలాహలం

భద్రాచలం: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆదివారం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో సందడి నెలకొంది. అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఉదయం గోదావరి నదిలో పుణ్య స్నానాలను ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలను స్వీకరించారు. దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులకు అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. అనంతరం నిత్యకల్యాణానికి స్వామివారిని పల్లకీ సేవగా చిత్రకూట మండపానికి తీసుకొచ్చారు. ఆ తర్వాత అర్చకులు స్వామివార్లకు విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణం ఘనంగా జరిపారు. కాగా, ఈ నెల 10న ఆషాఢ పూర్ణిమ సందర్భంగా గిరిజన ఉత్సవం దమ్మక్క సేవాయాత్రను వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ ఎల్.రమాదేవి తెలిపారు.

ఆర్టీసీ బస్సులో ఎమ్మెల్యే జారే ప్రయాణం..



ప్రయాణికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

దమ్మపేట: మండలంలోని ముష్టిబండ గ్రామం నుంచి అశ్వారావుపేట వరకు ఆదివారం ఎమ్మెల్యే జారే ఆదినా రాయణ ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. సత్తుపల్లి డిపో కు చెందిన ఆర్డినరీ బస్సులో ముష్టిబండ గ్రామంలో ఎమ్మెల్యే జారే ఎక్కారు. ప్రయాణిస్తున్న మహిళలను పలకరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అందుతున్నాయా? లేదా అని ఆరా తీశారు. గ్రామాల్లో ప్రధానంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

పెద్దమ్మతల్లికి జలాభిషేకం



అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పెద్దమ్మతల్లి అమ్మవారికి అర్చకులు జలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆదివారం తొలి ఏకాదశి పండుగ కావడంతో మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అర్చకులు అమ్మవారికి విశేష పూజలు జరపగా, భక్తులు క్యూలైన్ ద్వారా దర్శించుకున్నారు. అన్నప్రాసనలు, ఒడిబియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమంలో ఈఓ ఎన్. రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, డైరెక్టర్లు, వేదపండితుడు పద్మనాభశర్మ, అర్చకుడు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి తాంబాళం బహూకరణ

పెద్దమ్మతల్లి అమ్మవారికి హైదరాబాద్‌కు చెందిన భక్త దంపతులు పాల్కంపల్లి ప్రసాద్, అరుణ రూ.7,116 విలువైన వెండి తాంబాళం బహూకరించారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

కవిత్వంతో సామాజిక చైతన్యం

కలెక్టర్ జితేష్ వి.పాటిల్



జయరాజును సన్మానిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్, వైరా ఎమ్మెల్యే రాందాస్

కొత్తగూడెంఅర్బన్: కవులు తమ కవిత్వంతో సామాజిక సమస్యలపై ప్రజల్లో చైతన్యం రగిలిస్తారని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ పేర్కొన్నారు. ఆదివారం కొత్తగూడెం క్లబ్‌లో ప్రజా సంఘాల వేదిక ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ అవార్డు గ్రహీత, ప్రముఖ ప్రజా, ప్రకృతి కవి జయరాజును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజాన్ని చైతన్యం వైపు నడిపించేందుకు కవులు, రచయితలు ఎంతో మానసిక సంఘర్షణ ఎదుర్కొంటారని, అలాంటి వారిని గుర్తించి సత్కరించడం శుభపరిణామం అన్నారు. ప్రజా సంఘాల వేదిక కన్వీనర్ జే.బీ.శౌరీ మాట్లాడుతూ జయరాజ్ సామాజిక ఉద్యమాల యోధుడని పేర్కొన్నారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసిన అంబేద్కర్ వాదులు, సామాజిక ఉద్యమకారులు, ప్రకృతి ప్రేమికులను అభినందించారు. కాగా జయరాజుతో పాటు వివిధ రంగాల్లో విశేష సేవలందించిన మరో 14 మందిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో సన్మాన గ్రహీతలు తాళ్లూరి వెంకటేశ్వరరావు, కోచ్ మాస్టర్ షమీ ఉద్దీన్, ఎస్.కె.బాసిత్, కాల్వ దేవదాస్, మొక్కల వెంకటయ్య, వేల్పుల భాస్కర్, ప్రకృతి వైద్యులు సుగుణారావు, కోచైర్మన్ కూసపాటి శ్రీను, బిక్కసాని నాగేశ్వరరావు, ఎర్రా కామేష్, మారపాక రమేష్ కుమార్, శనగ వెంకటేశ్వర్లు, కోచర్ల కమలారాణి తదితరులు పాల్గొన్నారు.

ఎవరూ నిరాశ చెందొద్దు



లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్న రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన ఎంపీ రఘురాం రెడ్డి, ఎమ్మెల్యే కూనంనేని, కలెక్టర్ జితేష్ వి.పాటిల్

- రాబోయే విడతల్లో మిగిలినవారికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు గుండు సున్నా ఖాయం
- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి
- లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ

కొత్తగూడెంఅర్బన్: భవిష్యత్‌లో గుడి లేని గ్రామం ఉంటుందేమో కానీ ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామం ఉండదని, అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మొదటి విడతలో ఇళ్లు రానివారు నిరాశకు గురి కావొద్దని, రెండో విడతలో మంజూరు చేస్తామని తెలిపారు. ఆదివారం కొత్తగూడెం క్లబ్‌లో లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, పాల్వంచ, చుంచుపల్లి మండలాల లబ్ధిదారులకు ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావులతో కలిసి ఆయన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఎస్‌ఆర్‌టీ నగర్, మాయాబజార్ ప్రాంతాల నిర్వాసితులకు ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం లక్ష్మీదేవిపల్లి మండలం సీతారాంపురం, చింతపెంటిగూడెంలో హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తొలిఏకాదశి రోజున ఆడబిడ్డలకు ఇందిరమ్మ ఇళ్ల పత్రాలు ఇవ్వడం శుభపరిణామమని పేర్కొన్నారు.

ప్రతీ సోమవారం ఖాతాల్లో నగదు..

మొదటి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్లు ఇస్తున్నామని, ఇందులో రెండున్నర లక్షల ఇళ్ల నిర్మాణం వడివడిగా సాగుతోందని అన్నారు. ప్రతీ సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ అవుతుందని తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో మహిళలకు ఉచిత బస్సు, రూ. 500కే వంట గ్యాస్, రేషన్ కార్డుల పంపిణీ, రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం పరిమితి రూ. 10 లక్షలకు పెంపు, రుణమాఫీ, రైతు భరోసా వంటి సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నామని చెప్పారు. రూ. 21 వేల కోట్ల రుణమాఫీ చేశామని, నాలుగు రోజుల క్రితమే రూ. 9 వేల కోట్ల రైతు భరోసా అందించామని వివరించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అర్హులకు సంక్షేమ పథకాలు అందలేదని విమర్శించారు. ఇందిరమ్మ ప్రభుత్వం ప్రజా శ్రేయస్సు కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుండగా, కొందరు విషం చిమ్మే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా వారికి గుండు సున్న ఖాయమని స్పష్టం చేశారు.

పదేళ్లలో రూ. 8.19 లక్షల కోట్ల అప్పు

రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన బీఆర్‌ఎస్ 8 లక్షల 19 వేల కోట్ల రూపాలయ అప్పు చేసిందని మంత్రి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఎంపీ రామసహాయం రఘురామరెడ్డి, రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయబాబు మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ రామవరంలో భూములకు రిజిస్ట్రేషన్ చేసే అవకాశం కల్పించాలని కోరారు. కొత్తగూడెంలో జర్నలిస్టులకు బీపీఎల్ కోటాలో స్థలాలు మంజూరు చేయాలని అన్నారు. కొత్తగూడెం ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ పట్టాల ప్రక్రియను హోల్డ్‌లో పెట్టారని, దానిని ఎత్తివేయాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తామని ఎవరైనా డబ్బులు అడిగితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటీడీఏ పీఓ బి.రాహుల్, ట్రైనీ కలెక్టర్ సౌరభ్‌శర్మ, అదనపు కలెక్టర్ విద్యాచందన, నాయకులు కొత్వాల శ్రీనివాసరావు, మండే వీరహనుమంతరావు, రజాక్, ఆళ్ల మురళి, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మంత్రిని కలవకుండా మహిళల అరెస్ట్



టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో వినతిపత్రాలు చూపుతున్న మహిళలు

కొత్తగూడెంటౌన్: మంత్రిని కలవకుండా తొమ్మిది మంది మహిళలను టూటౌన్ పోలీసులు ఆదివారం ముందస్తుగా అరెస్ట్ చేశారు. మాయాబజార్, రుద్రంపూర్‌లకు చెందిన తొమ్మిది మంది పల్లపు కొమరమ్మ, బండారి లీలావతి, గుంజా నాగమణి, కల్లూరి రేణుకా, ఓర్సు, అనుషా, ఓర్సు రాజేశ్వరి, పల్లపు శారద, బండా ప్రవళిక, పల్లపు శైలజాతోపాటు ఓర్సు వెంకన్న, పల్లపు రాజేష్‌లు మాట్లాడుతూ తమకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెప్పి, ఇవ్వలేదని పేర్కొన్నారు. కొత్తగూడెం క్లబ్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి ఈ సమస్య చెప్పుకుందామంటే సీఐ అరెస్ట్ చేసి, వెళ్లకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. కాగా మంత్రి పర్యటన ముగిశాక పోలీసులు వారిని వదిలిపెట్టారు.

క్రీడా పాఠశాలలతో ఉజ్వల భవిష్యత్..

- స్పోర్ట్స్ స్కూళ్లలో చేరేందుకు బాలబాలికల ఆసక్తి
- చిన్నారులను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు
- గత ఏడేళ్లలో రాష్ట్రస్థాయి పోటీలకు 106 మంది ఎంపిక
- ఏటా జూన్‌లో మండల, జిల్లాస్థాయి పోటీల నిర్వహణ



కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

కొత్తగూడెంటౌన్: 'మాకు క్రికెట్ అంటే ఇష్టం.. ధోనిలా ఆడతాం. పీటీ ఉషలా పరుగెడతాం. గోపీచంద్, సైనా నెహ్వాల్‌లా బ్యాడ్మింటన్ ఆడతాం.' అంటూ చిన్నారులు క్రీడపట్ల ఆసక్తి చూపుతున్నారు. నచ్చిన క్రీడలను ఎంచుకుని రాణించేందుకు ఉత్సాహం చూపుతున్నారు. కొందరు క్రీడా పాఠశాలల్లో చేరి రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించేందుకు శ్రమ పడుతున్నారు. స్పోర్ట్స్ కోటాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు కూడా వస్తుండటంతో తల్లిదండ్రులు కూడా ప్రోత్సహిస్తున్నారు. క్రీడా పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు ప్రభుత్వం ఫ్రీ హాస్టల్ వసతి కల్పిస్తోంది. చదువుతోపాటు క్రీడల్లో శిక్షణనిస్తోంది. వివిధ క్రీడా పోటీలకు రాష్ట్రం తరపున విద్యార్థులను పంపిస్తోంది. ఈ నేపథ్యంలో చిన్నారులు క్రీడా పాఠశాలలో చేరేందుకు ఆసక్తి చూపుతుండగా, తల్లిదండ్రులు తోడ్పాటునందిస్తున్నారు.

ఏటా జూన్‌లో ఎంపికలు

ప్రతి ఏడాది క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు జూన్‌లో ఎంపికలు నిర్వహిస్తారు. మూడో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు నాలుగో తరగతిలో అడ్మిషన కల్పిస్తారు. గత నెల 26న కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో ఎంపికలు నిర్వహించారు. జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో మండల, జిల్లాస్థాయిలో ఎంపికలు నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఎంపికైన విద్యార్థులను రాష్ట్రంలోని మూడు స్పోర్ట్స్ పాఠశాలల్లో ప్రవేశం కల్పిస్తారు. హైదరాబాద్‌లోని హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లలో ప్రభుత్వ క్రీడా పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో 4వ తరగతిలో చేర్పిస్తే, 12వ తరగతి వరకు విద్యాభ్యాసంతో ఫ్రీ హాస్టల్ వసతి కల్పిస్తారు. క్రీడల్లో శిక్షణనిస్తూ వివిధపోటీలకు విద్యార్థులు హాజరయ్యేలా చూస్తారు.

ఈసారి రాష్ట్రస్థాయి పోటీలకు 20 మంది..

గత జూన్‌లో జిల్లాలోని కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో క్రీడా పాఠశాలల్లో ఎంపికలు నిర్వహించారు. 170 మంది చిన్నారులు పోటీపడగా 20 మంది బాలబాలికలు ఎంపికయ్యారు. వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నారు. ఏ చిన్నారిని పలకరించినా జాతీయస్థాయిలో రాణిస్తామని, పతకాలు సాధిస్తామని చెబుతున్నారు. గత ఏడేళ్లలో జిల్లా నుంచి సుమారు 106 మందికి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 2018 ఏడాదిలో 20 మంది, 2019లో ఆరుగురు, 2020లో పది మంది, 2022 సంవత్సరంలో 20, 2023 ఏడాదిలో 17 మంది, 2024లో 13 మంది, 2025 ఏడాదిలో 18 మంది ఎంపికైనట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ఎం.పరంధామరెడ్డి తెలిపారు.

ఖోఖో అంటే ఇష్టం



నాకు ఖోఖో ఆడటం అంటే చాలా ఇష్టం. ఖోఖోలో బాగా ఆడి పతకాలు సాధించడం నా లక్ష్యం. అందరితో ఇలా పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది. స్కూల్‌లో కూడా రోజూ మా ఫ్రెండ్స్‌తో కలిసి ఆడతాను. – కె. వివేక్, కొత్తగూడెం

ఒలింపిక్స్‌లో పాల్గొంటాను



నాకు అథ్లెటిక్స్ అంటే ఇష్టం. ఒలింపిక్ క్రీడల్లో పాల్గొని పతకాలను సాధించాలని నా ఆశయం. రోజూ ప్రాక్టీస్ చేస్తున్నాను. భవిష్యత్‌లో బెస్ట్ ప్లేయర్‌గా రాణిస్తాను. అమ్మానాన్నలు కూడా ప్రోత్సహిస్తున్నారు. –కె.స్నేహిత, ఆళ్లపల్లి

స్పోర్ట్స్ పాఠశాలలతో ఉపయోగం



క్రీడలతోపాటు చదువులో రాణించాలనుకునే చిన్నారులకు స్పోర్ట్స్ స్కూల్స్ చాలా ఉపయోగకరంగా ఉంటాయి. ఈ సారి జిల్లా నుంచి 20 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపాం.

–ఎం.పరంధామరెడ్డి, డీవైఎస్‌ఓ

క్లుప్తంగా

అథ్లెటిక్స్‌లో ఐదు పతకాలు



రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు హాజరైన క్రీడాకారులు

కొత్తగూడెంటౌన్: రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారులు ఐదు పతకాలు సాధించారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ కె.మహీధర్ ఆదివారం వివరాలు వెల్లడించారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి 20 మంది పాల్గొన్నారు. వారిలో కొత్తగూడేనికి చెందిన సీహెచ్ కృతిక కిడ్స్ జావెలిన్ త్రోలో రజత పతకం, కిన్నెరసానికి చెందిన డి.లోకేష్ ట్రయలాన్‌లో రజత పతకం, కాచనపల్లికి చెందిన వై.శృతిహాసన్ ట్రయలాన్‌లో రజత పతకం, భద్రాచలానికి చెందిన వి.సంజనశ్రీ 60 మీటర్ల పరుగుపందెంలో కాంస్య పతకం, కిన్నెరసానికి చెందిన కె.దిలీప్ ట్రయలాన్‌లో కాంస్య పతకం సాధించారు. విజేతలను జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి ఎం.పరంధామరెడ్డి, కోచ్‌లు, అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

హైడ్రోజన్ పెరాక్సైడ్ తాగిన బాలుడు..

- తల్లిదండ్రుల అప్రమత్తతతో తప్పిన ప్రాణాపాయం

కరకగూడెం: మండలంలో ఇటీవల థమ్సప్ బాటిల్‌లో నిల్వ ఉంచిన గడ్డిమందును తాగి ఒక బాలు డు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన మరవకముందే అలాంటిదే మరో ఘటన స్థానికంగా కలకలం రేపింది. అయితే ఈసారి తల్లిదండ్రుల సకాలంలో స్పందించడంతో ఆ చిన్నారికి ప్రాణాపాయం తప్పింది. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రానికి చెందిన మూడేళ్ల బాలుడు ఆదివారం ఉదయం ఆడుకుంటూ గ్రా మంలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. అక్కడ ఖాళీ స్ప్రైట్ బాటిల్‌లో నిల్వ ఉంచిన హైడ్రోజన్ పెరాక్సైడ్ ద్రావణాన్ని చూసి మంచినీళ్లు అనుకుని తాగేసి ఇంటికి వచ్చాడు. ఆతర్వాత కొద్దిక్షణాల్లోనే బాలుడు తీవ్రమైన కడుపునొప్పితో విలవిల్లాడిపోయి వాంతులు, విరేచనాలు చేసుకుంటూ స్పృహ కోల్పోయాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంకటే మణుగూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు చికిత్స అందించి ఇంటికి పంపించడంతోవారంతా ఊపిరిపీల్చుకున్నారు. కాగా, ఇటువంటి ప్రమాదాలు తరచుగా జరుగుతుండడంపై వైద్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తల్లిదండ్రులు విషపూరిత పదార్థాలను పిల్లలకు దూరంగా ఉంచాలని, ముఖ్యంగా మంచి నీళ్లు లేదా కూల్‌డ్రింక్స్ బాటిళ్లలో రసాయనాలను నిల్వ చేయొద్దని స్పష్టం చేస్తున్నారు.

'అబద్ధాలతోనే రేవంత్ పాలన'

ఖమ్మంరూరల్: అబద్ధాలు చెబుతూ సీఎం రేవంత్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేశ్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం ఎదులాపురం సాయిగణేశనగర్‌లోని మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రజలు కాంగ్రెస్ పాలనను నిశితంగా గమనిస్తున్నారని, బీఆర్‌ఎస్ అంటే భరోసా అని, కాంగ్రెస్ అంటే కన్నింగ్ అని పేర్కొన్నారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏఒక్క హామీని కూడా నిలబెట్టుకోలేదని, పొద్దున లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు కేసీఆర్, కేటీఆర్‌ను తిట్టటమే రేవంత్‌రెడ్డి పనిగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. రైతుబంధు నిధులు ఎగ్గొట్టారని, విత్తనాలు, ఎరువుల కోసం క్యూలైన్‌లో అర్ధరాత్రి వరకు నిలడబడాల్సి వస్తోందని తెలిపారు. దమ్ము, ధైర్యం ఉంటే కేటీఆర్ విసిరిన సవాల్ స్వీకరించి చర్చకు రావాలని సూచించారు. సమావేశంలో బెల్లం వేణుగోపాల్, భాషబోయిన వీరన్న, ఉన్నం బ్రహ్మయ్య, జర్పుల లక్ష్మణ్‌నాయక్, కోటి సైదారెడ్డి, ఉదయ్, సొడేపొంగు ప్రశాంత్, మాదాసు ఆదాం తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనలో ఉద్యోగాలు లేవు..

ఖమ్మంమయూరిసెంటర్: ఏటా రెండు కోట్ల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన మోదీ పాలనలో రిటైర్మెంట్‌లు తప్ప రిక్రూట్‌మెంట్‌లు లేవని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు విమర్శించారు. సీపీఐ ఖమ్మం నగర 5వ మహాసభ ఆదివారం నగరంలోని సెయింట్ మేరీస్ హై స్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించారు. సభకు ముందు నగరంలో సీపీఐ శ్రేణులు భారీ ప్రదర్శన నిర్వహించారు. సీపీఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు పార్టీ జెండా ఆవిష్కరించారు. హేమంతరావు మాట్లాడుతూ.. బీజేపీ పాలనలో ప్రభుత్వ రంగం నిర్వీర్యమైందని, దేశ సంపదను ప్రైవేట్ వ్యక్తుల చేతులో పెట్టడంలో మోదీ ప్రభుత్వం రికార్డులు సృష్టించిందని విమర్శించారు. అలీన విధానానికి కేంద్ర ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అడుగులకు మడుగులొత్తుతున్నారని మండిపడ్డారు. మతోన్మాద బీజేపీతో దేశానికి ప్రమాదం పొంచి ఉందన్నారు. అనంతరం పువ్వాడ నాగేశ్వరరావు మాట్లాడారు. సభలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేశ్, నాయకులు మహ్మద్ మౌలానా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, బీజీ క్లైమెంట్, నగర కార్యదర్శి జానీమియా, మహ్మద్ సలాం, మిడికంటి వెంకటరెడ్డి, పగడాల మల్లేశ్, మేకల శ్రీనివాసరావు, జ్వాలా నర్సింహారావు, యానాలి సాంబశివారెడ్డి, నూనె శశిధర్, ఏనుగు గాంధీ పాల్గొన్నారు.

ఉన్నత చదువులకు 'ఓపెన్'

- పదో తరగతి, ఇంటర్ చదివే అవకాశం
- ఈనెల 11 వరకు దరఖాస్తుల స్వీకరణ
- ఉమ్మడి జిల్లాలో 56 స్టడీ సెంటర్లు



స్టడీ సెంటర్‌లో మాట్లాడుతున్న ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ పాపారావు (ఫైల్)

ఖమ్మంసహకారనగర్: ఓపెన్ స్కూల్ అనేది ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే వారికి ఓ వరం లాంటిది. వివిధ కారణాలతో విద్యను అభ్యసించలేకపోయిన వారు, చదువును మధ్యలోనే నిలిపివేసిన వారు, తమ వయసుతో సంబంధం లేకుండా మళ్లీ విద్యను అభ్యసించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సదవకాశాన్ని ఇచ్చింది. ఓపెన్ స్కూల్ పేరుతో నిర్వహిస్తున్న ఈ కేంద్రాల్లో 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యను అందిస్తారు. చదువుకోవాలనే ఆసక్తి ఉన్న వారు ఈ ఓపెన్‌స్కూల్స్‌లో చేరేందుకు ఈ నెల 11వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. 2008వ విద్యా సంవత్సరంలో ఓపెన్ స్కూల్ విధానం ప్రారంభం కాగా.. అప్పటి నుంచే పదో తరగతి ప్రారంభించారు. 2010–11వ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్‌ను ప్రారంభించారు.

56 కేంద్రాలు..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొత్తం 56 ఓపెన్ స్కూల్ కేంద్రాలుండగా... అందులో ఖమ్మం జిల్లాలో 25 సెంటర్లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 31 కేంద్రాలున్నాయి. చిన్నప్పటి నుంచి చదువుకోకపోయినా సరే నేరుగా పదో తరగతిలో చేరే అవకాశం వీటి ద్వారా కలుగుతుంది. వయోజనులు కూడా ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని తాము ఉన్నత విద్యావంతులుగా మారేందుకు కృషి చేసుకోవచ్చు.

అర్హతలిలా...

పదో తరగతిలో చేరాలనుకునే వారికి 31–08–2025 నాటికి 14 సంవత్సరాలు నఉండాలి. ఇంటర్మీడియట్‌లో చేరేందుకు 15 సంవత్సరాలు నిండి ఉండాలి. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులు. చదివిన తరగతులకు సంబంధించిన టీసీ, బోనఫైడ్ జత చేయాల్సి ఉంటుంది. ఇంటర్మీడియట్ చదవాలనుకునే వారు మాత్రం తప్పకుండా పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.

11 వరకు గడువు..

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశం పొందాలనుకునే ఈ నెల 11వ తేదీ వరకు దరఖాస్తులు అధ్యయన కేంద్రంలో సమర్పించాల్సి ఉంటుంది. అదే విధంగా అపరాధ రుసుం పదో తరగతికి రూ.100, ఇంటర్మీడియట్‌కు రూ.200లతో ఆగస్టు(వచ్చే నెల) 12వ తేదీ వరకు మీ సేవా, ఆన్‌లైన్ కేంద్రాల్లో చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చు.

ఫీజులు

పదో తరగతికి జనరల్ పురుషులకు రూ.1,550, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, మైనార్టీలు, మహిళలకు రూ.1,150 చెల్లించాలి. ఇంటర్మీడియట్‌కు జనరల్ పురుషులకు రూ.1,800, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ దివ్యాంగులకు రూ.1,500 చెల్లించాల్సి ఉంటుంది. పదో తరగతి అడ్మిషన్ పొందేందుకు గాను వయస్సు ధ్రువీకరణ కోసం పుట్టిన తేదీని తెలిపే ఏదైనా పాఠశాల రికార్డు షీట్/టీసీ లేదా మున్సిపల్ అధికారి/ తహసీల్దార్/జిల్లా జనన మరణ రిజిస్ట్రార్ జారీ చేసిన పుట్టిన తేదీ ధ్రువపత్రం సమర్పించాలి. వచ్చే నెల 31 నాటికి 14 ఏళ్లు నిండి ఉన్న వారు తమ ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ కలర్ ఫొటోలు తీసుకెళ్లాలి. అలాగే ఇంటర్‌లో ప్రవేశాలకు పదో తరగతి ఉత్తీర్ణత సర్టిఫికెట్ అదనంగా సమర్పించాల్సి ఉంటుంది.

కొత్త కేంద్రాలివే...

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు అభ్యర్థుల నుంచి ఆసక్తి పెరుగుతున్న క్రమంలో జిల్లాలో కొత్తగా జెడ్పీహెచ్‌ఎస్ రఘునాథపాలెం, జెడ్పీహెచ్‌ఎస్ ఏదులాపురం, జీహెచ్‌ఎస్ నేలకొండపల్లి, జెడ్పీహెచ్‌ఎస్ తల్లాడలలో అదనంగా కేంద్రాలను ఏర్పాటు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జెడ్పీహెచ్‌ఎస్ కరకగూడెం, అశ్వాపురం మండలం జెడ్పీహెచ్‌ఎస్ మిట్టగూడెం, జెడ్పీహెచ్‌ఎస్ ఆళ్లపల్లి, జీహెచ్‌ఎస్ టేకులపల్లి, జెడ్పీహెచ్‌ఎస్ చంద్రుగొండ, జెడ్పీహెచ్‌ఎస్ ఎర్రగుంట (అన్నపురెడ్డి మండలం), జెడ్పీహెచ్‌ఎస్ లక్ష్మీదేవిపల్లిలలో కేంద్రాలను ఏర్పాటు చేశారు.

గత మూడేళ్లలో అడ్మిషన్లు, ఫలితాలిలా..

సంవత్సరం	పదో తరగతి	ఫలితాలు	ఇంటర్మీడియట్	ఫలితాల శాతం
ఖమ్మం జిల్లా				
2022-23	770	26.3	995	48.53
2023-24	789	40.44	881	44.71
2024-25	607	40.44	797	57.93
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా				
2022-23	671	23.66	856	40.48
2023-24	623	32.28	788	50.97
2024-25	538	31.04	728	51.19

సద్వినియోగం చేసుకోవాలి



ఉన్నత చదువులు చదువుకోవడానికి ఓపెన్ స్కూల్ ఒక మంచి అవకాశం. చదువులు మధ్యలో ఆపేసిన వారు, చదవాలనుకునే వారు ఇందులో అడ్మిషన్ పొందొచ్చు. పది, ఇంటర్మీడియట్ చదవాలనుకునే వారు ఈ నెల 11 తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలి.

– సామినేని సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖాధికారి, ఖమ్మం

ఉన్నత విద్యకు దోహదం



ఓపెన్ స్కూల్‌లో విద్యనభ్యసించి ఉన్నత స్థానాలకు వెళ్లిన వారున్నారు. అభ్యర్థుల ఆసక్తి మేరకు ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో కొత్తగా 11 కేంద్రాలు ఏర్పాటయ్యాయి. ఆసక్తి కలిగిన అభ్యర్థులు సంబంధిత అధ్యయన కేంద్రాలు, ఆన్‌లైన్ సెంటర్లలో దరఖాస్తు చేసుకోవాలి.

– మద్దినేని పాపారావు, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్

వణికిస్తున్న విషజ్వరాలు..



భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పేషంట్లు

- ఏజెన్సీలో విజృంభిస్తున్న దోమలు
- జిల్లాలో ఇప్పటికే 25 మలేరియా, 9 డెంగీ కేసుల నిర్ధారణ
- రోగులతో కిటకిటలాడుతున్న ఆస్పత్రులు
- పంచాయతీల్లో పడకేసిన పారిశుద్ధ్యం



పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో పూడిక తీయని డ్రైయినేజీ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏజెన్సీ ప్రాంతంలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు స్వల్ప కాలంలోనే జ్వరపీడితుల సంఖ్య విపరీతంగా పెరిగింది. ప్రతీ శుక్రవారం డ్రైడేగా పాటించాలని ఆదేశాల జారీ చేసినా.. తూతూమంత్రంగా నిర్వర్తిస్తుండడంతో ఏజెన్సీ గ్రామాల్లో వ్యాధుల వ్యాప్తి తగ్గడం లేదు. పారిశుద్ధ్యంపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో మురుగు కాల్వల్లో వ్యర్థాలు, పూడిక తీయక నీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతూ సీజనల్ వ్యాధులు ప్రబలడానికి అనుకూలంగా తయారైంది.

ఆస్పత్రులు కిటకిట..

భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. ఒక్కో ఆస్పత్రి ఓపీ 100 నుంచి 200కి పైగా ఉంటుందంటే పరిస్థితి ఏవిధంగా ఉందో తెలుస్తోంది. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోనూ సాధారణ రోజుల్లో కంటే రెండింతలు ఎక్కువే వస్తున్నారు. ప్రస్తుతం విష జ్వరాలు, డెంగీ వ్యాధులు ప్రబలే కాలం కావడంతో రానున్న రోజుల్లో వీటి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఈనేపథ్యాన గ్రామాల్లో ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ఇంటింటా సర్వే చేస్తుండగా జ్వరపీడితులు ఆర్‌ఎంపీలను ఆశ్రయించడం లేదా జ్వరం తగ్గకపోతే ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేరి రూ.లక్షలు పోగొట్టుకుంటున్నారు.

ప్రైవేట్‌లో దోపిడీ...

విషజ్వరాలు ప్రబలడంతో ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు ఆడిందే ఆట, పాడిందే పాటగా మారింది. యజమానులు, వైద్యులు అడిగినంత చెల్లించుకోవాల్సి వస్తోంది. ఏజెన్సీ గ్రామాల్లో విషజ్వరాలు పెరిగిపోతుండడంతో స్థానికంగా ఏ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లినా రోగులతో కిక్కిరిసి పోతున్నాయి. ముఖ్యంగా మెడికల్ మాఫియా జోరు కొనసాగుతోంది. గతంలోడెంగీ, చికెన్‌గున్యా వ్యాధులకు పరీక్షల పేరిట రూ.1800లు వసూలు చేయగా ఇప్పుడు భద్రాచలం ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు రూ.1200 వసూలు చేస్తున్నారు. ఇక సీబీపీ, టైఫాయిడ్, మలేరియా, సీఆర్‌పీ పేరుతో రూ.2 వేలకు బదులు రూ.800లు వసూలు చేస్తున్నారు. కాగా, ఈ రేట్లను కొంతమంది మాత్రమే అనుసరిస్తున్నారని, ఇంకొందరు అవసరం లేకున్నా ఇతర పరీక్షలు చేయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్‌ఎంపీలు ల్యాబ్‌ల వారితో కుమ్మక్కై రోగుల వద్ద నుంచి ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్నారు. విషజ్వరాలు విస్తరించకుండా అవగాహన కల్పించాల్సిన వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు నామమాత్రంగా పర్యటన చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సర్కారు లెక్కలకు పదింతలు తేడా...

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిక లెక్కల ప్రకారం ఈ ఏడాది ఇప్పటి వరకు 25 మలేరియా, 7 డెంగీ కేసులు నమోదయ్యాయి. కాగా ఈ లెక్కలకు వాస్తవ పరిస్థితులకు పొంతన లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. అంతకు పదిరెట్లు బాధితులు ఉంటున్నారని తెలుస్తోంది. ప్రైవేట్ ఆస్పత్రుల్లో జ్వర పీడితులు భారీగా చేరుతున్నప్పటికీ అధికారుల లెక్కల్లో ఆ కేసులు నమోదు కావడం లేదు. వాటి కూడా పరిగణలోకి తీసుకుంటే కేసుల సంఖ్య భారీగా నమోదయ్యే అవకాశం ఉందని పలువురు అంటున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి..



ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఏజెన్సీల్లో జ్వర పీడితుల సంఖ్య పెరుగుతున్నట్లుగా తెలుస్తోంది. దీంతో వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యాన ముందస్తు చర్యలు చేపట్టాం. దోమల నివారణ చర్యలు చేపట్టాలని, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించాం. ప్రజలు వారి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. డెంగీ లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వాస్పత్రుల్లో చూపించుకోవాలి. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇష్టానుసారంగా డబ్బులు దండుకుంటే చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ చైతన్య, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

రాజీవ్ స్వగృహ ప్లాట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న గుంటుపల్లి శ్రీనివాసరావు

ఖమ్మం సహకారనగర్: టీఎన్జీవోస్ సభ్యులకు రాజీవ్ స్వగృహ ప్లాట్లు కేటాయించాలని సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు కోరారు. ఆదివారం టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఎన్జీవోస్ హౌస్ బిల్డింగ్ సొసైటీలో సుమారు 3,500 మంది సభ్యులు ఉన్నారని, ఇందులో సగం మందికే ఇళ్ల స్థలాలు వచ్చాయని, మిగతా వారికి రాజీవ్ స్వగృహ ప్లాట్లు నాలుగు బ్లాక్‌లు టీఎన్జీవోస్ హౌస్ బిల్డింగ్ సొసైటీలకు కేటాయించాలని తీర్మానించామని అన్నారు. మధ్య తరగతి ఉద్యోగులు టీఎన్జీవోస్‌లో అధికంగా ఉన్నారని, అందరికీ న్యాయం చేయాలని కోరారు. అనంతరం టీఎన్జీవోస్ సెంట్రల్ కమిటీకి ఎన్నికైన బాలకృష్ణ, జైపాల్ విజయ్‌కుమార్‌తో పాటు ఇటీవల పదోన్నతులు పొందిన ఎర్రమల శ్రీనివాసరావు, నాగరాజును సత్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి కొణిదన శ్రీనివాస్, నాయకులు కొమరగిరి దుర్గాప్రసాద్, వల్లపు వెంకన్న, శ్రీధర్ సింగ్, ప్రకాశరావు, కరణ్‌సింగ్, తాళ్లూరి శ్రీకాంత్, చంద్రశేఖర్, ఏలూరి హరికృష్ణ, రాధికారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ములుగు, భద్రాద్రి జిల్లాల్లో తుమ్మల పర్యటన

ఖమ్మంఅర్బన్: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం భద్రాద్రి, ములుగు జిల్లాల్లో పర్యటించనున్నారు. ఈ మేరకు మంత్రి క్యాంప్ కార్యాలయం నుంచి ఆదివారం ఒక ప్రకటన విడుదలైంది. నేడు ఉదయం 7 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి 11.30 గంటలకు ములుగు జిల్లా వాజేడు చేరుకుంటారు. అక్కడ మొక్కజొన్నల రైతులకు మంత్రి సీతక్కతో కలిసి చెక్కులు పంపిణీ చేస్తారు. మధ్యాహ్నం 2.30 గంటలకు భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండలం బి.జి.కొత్తూరులో మర్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని పరిశీలిస్తారు. 3.30 గంటలకు భద్రాచలం అంబేద్కర్ సెంటర్‌లో డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ పనులకు శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం 4.30 గంటలకు కొత్తగూడెం ఐడీఓసీలో నిర్వహించే సమావేశంలో పాల్గొంటారు.

వీఎం బంజర్‌లో చోరీ..

పెనుబల్లి: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన ఘటన మండలంలోని వీఎం బంజర్‌లో శనివారం రాత్రి చోటుచేసుకుంది. జాతీయ రహదారి వెంబడి ఉంటున్న బుక్కా కృష్ణవేణి తన ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లింది.

ఆదివారం తొలిఏకాదశి పండుగ కావడంతో తెలిసిన వారికి ఇంటికి వెళ్లి శుభ్రం చేయాలని చెప్పడంతో వారు వెళ్లి చూసే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. సమాచారాన్ని కృష్ణవేణికి చేరవేడయంతో ఆమె వీఎం బంజర్ చేరుకుంది. శనివారం రాత్రే దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడి రెండు బీరువాల్లోని కేజీ వెండి వస్తువులు, 8 తులాల బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు బాధితురాలు తెలిపారు. ఘటనా స్థలాన్ని సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తిలింగంగౌడ్, ఎస్‌ఐ వెంకటేశ్‌తో పాటు క్లూస్ టీం పరిశీలించింది.

లింక్ పంపి.. డబ్బులు చోరీ..

గ్రామీణ ప్రజలను టార్గెట్ చేస్తున్న సైబర్ మోసగాళ్లు



రఘునాథపాలెం: స్మార్ట్‌ఫోన్‌ను ప్రతీ ఒక్కరు విరివిగా వాడుతున్నారు. బ్యాంకింగ్ సేవలు, పేమెంట్ యాప్స్ వాడకం ఎక్కువగా ఉండటంతో సాధారణ ప్రజలు కూడా స్మార్ట్‌ఫోన్ వినియోగిస్తున్నారు. అయితే, అమాయక ప్రజలు సైబర్ మోసాల బారి నపడుతున్నారు. ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలను లక్ష్యంగా చేసుకున్న సైబర్ నేరగాళ్లు తప్పుడు యాప్స్, గిఫ్ట్ లింకులు, ఫేక్ కాల్స్ ద్వారా వారి బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. నగరాల్లోనే కాక, రూరల్ ప్రాంతాల్లోనూ మొబైల్ బ్యాంకింగ్, గూగుల్ పే, ఫోన్ పే వంటివి విస్తృతంగా వాడకంలో ఉన్నాయి. దీనిని ఆసరాగా చేసుకున్న మోసగాళ్లు మొబైల్‌కు సందేశాల రూపంలో 'గిఫ్ట్ లభించింది', 'మీకు లాటరీ వచ్చింది', లేదా 'వివరాలు అప్‌డేట్ చేయాలి' అంటూ తప్పుడు లింకులు పంపుతున్నారు. అమాయకులు వాటిని ఓపెన్ చేస్తే, వారి ఫోన్ హ్యాకింగ్‌కు గురై ఖాతాల్లోని డబ్బులు మాయమవుతున్నాయి. రఘునాథపాలెం మండలంలో ఒక్క వారం వ్యవధిలోనే నాలుగు కేసులు నమోదవడం ఆందోళన కలిగిస్తోంది. కొందరు రూ.50,000 నుంచి రూ.80,000 వరకు నష్టపోయారు. ఇక పరువు పోతుందని భావించి చాలామంది మోసపోయిన విషయాన్ని బయటపెట్టడంలేదు. కాగా, సైబర్ మోసగాళ్లు మరో పంథాను ఎంచుకుంటున్నారు. 'మీ పిల్లలు కేసులో ఇరుక్కున్నారు.. డబ్బులు పంపించకపోతే అరెస్ట్ చేస్తాం' అంటూ వాట్సాప్ కాల్స్ చేస్తూ బెదిరింపులకు దిగుతున్నారు. ఈ తరహా మోసాలతో భయపడిన కొన్ని కుటుంబాలు డబ్బులు పంపించిన ఘటనలు ఉన్నాయి. పోలీసులు అవగాహన కల్పిస్తున్నా, సైబర్ నేరగాళ్లు కొత్త పంథాలో మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. 'ఏ సందేశమైనా, యాప్ అయినా డౌన్‌లోడ్ చేసేముందు తాను ఎవరితో డీలింగ్ చేస్తున్నానో తెలుసుకోవాలి. ఎవరికైనా డబ్బులు పంపేముందు నమ్మదగిన వ్యక్తుల దగ్గర సలహా తీసుకోవాలి' అని అధికారులు సూచిస్తున్నారు. సక్రమమైన బ్యాంకింగ్ యాప్‌ల ద్వారామాత్రమే లావాదేవీలు చేయాలని, గుర్తు తెలియని లింకులు క్లిక్ చేయొద్దని విజ్ఞప్తి చేస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి..



ప్రతీ ఒక్కరు సైబర్ మోసాల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. సాధ్యమైనంత మేర తెలిసిన వారి ద్వారానే యాప్‌ల ద్వారా లావాదేవీలు సాగించాలి. వచ్చిన ప్రతి మేసేజ్‌లను క్లిక్ చేయకుండా తెలియక పోతే తెలిసిన వారికి చూపించిన తర్వాతనే ముందుకు సాగాలి. సైబర్ మోసం జరిగినట్లు గుర్తించిన వెంటనే టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించి బ్యాంక్ లావాదేవీలను ఆపించాలి. కొత్త వ్యక్తులు పంపే లింక్‌లను ఓపెన్ చేయొద్దు. ఓటీపీలను చెప్పేముందు ఒకటికి రెండు సార్లు ఆరా తీయాలి.

– ఉస్మాన్‌షరీఫ్, సీఐ రఘునాథపాలెం

నిర్లక్ష్యానికి నిండుప్రాణం బలి..

బీపీతో గిరిజన మహిళ మృతి



మృతురాలు లక్ష్మి(ఫైల్)

దుమ్ముగూడెం: మండలంలోని మారాయిగూడెం గ్రామంలోని ఓ ఆర్‌ఎంపీ నిర్లక్ష్య కారణంగా పత్తిపాక గ్రామానికి చెందిన సోడి లక్ష్మి(45) మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. లక్ష్మి గత కొంతకాలంగా బీపీతో బాధపడుతూ శుక్రవారం కింద పడిపోయింది. దీంతో కుటుంబసభ్యులు ఓ ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లగా వైద్యం చేసిన సదరు ఆర్‌ఎంపీ భద్రాచలం తరలించాలని సూచించగా.. వారు అక్కడకు తీసుకెళ్లి చూపించారు. అక్కడ పరిస్థితి విషమంగా మారడంతో ఖమ్మంకు రిఫర్ చేయగా.. అంబులెన్స్‌లో వారితో పాటే సదరు ఆర్‌ఎంపీ వెళ్లడం.. మార్గం మధ్యలో తరచూ ఆపుతూ వెళ్లడంతో ఖమ్మం చేరేసరికి ఆలస్యమైంది. అయినా చికిత్స అందించే క్రమానికి మరింత ఆలస్యం కావడంతో ఆమె మృతి చెందింది. లక్ష్మి మృతికి ఆర్‌ఎంపీ వైద్యుడి నిర్లక్ష్యమే కారణమంటూ మృతురాలి కుటుంబసభ్యులు ఆర్‌ఎంపీకి దేహశుద్ధి చేసినట్లు తెలిసింది.

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ..

వ్యక్తి దుర్మరణం

ములకలపల్లి: ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఓ లారీ ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణంపాలయ్యాడు. కొత్తగంగారం అటవీ ప్రాంతంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలను ఎస్సై కిన్నెర రాజశేఖర్ ఇలా తెలిపారు. అశ్వారావుపేట మండలం దురదపాడు గ్రామానికి చెందిన కుర్సం అర్జున్‌రావు(38) స్నేహితులతో కలిసి ట్రాక్టర్‌పై ములకలపల్లి మండలంలోని పాతగుండాలపాడు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మూత్రవిసర్జన నిమిత్తం ట్రాక్టర్‌ను కొత్తగంగారం అటవీ ప్రాంతంలో ఆపగా.. అటు వైపుగా వస్తున్న లారీ వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ సీటు పక్కన కూర్చున్న అర్జున్‌రావుతలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్యపద్మఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి స్వాధీనం

నలుగురిపై కేసు నమోదు

పాల్వంచరూరల్: ఒరిస్సా నుంచి తీసుకొచ్చి స్థానికంగా గంజాయిని విక్రయిస్తున్న నలుగురు యువకులను పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండల పరిధి సోములగూడెం వైపు వెళ్లే మార్గంలో ఆదివారం ఎస్సై సురేష్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాడు. ఈక్రమంలో జామాయిల్ తోటలో పాల్వంచకు చెందిన షకీర్, గోపి, జగన్నాథపురం గ్రామానికి చెందిన చరణ్, శ్రీరాంలు అనుమానస్పదంగా సంచరించడంతో వారిని పట్టుకుని విచారించారు. దీంతో వారి వద్ద ఒరిస్సాలోని బెజంగూడా నుంచి రూ.19వేల విలువ కలిగిన 380 గ్రాముల గంజాయి లభించింది. గంజాయిని స్వాధీనం చేసుకుని నలుగురు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.